# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 24 జూన్, 2026 | పేజీలు :08


## తవ్వారు.. వదిలారు

### ఎలాంటి హెచ్చరిక బోర్డు లేకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

### సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ నగరంలోని 40వ డివిజన్ హనుమాన్‌నగర్‌లో డ్రైనేజీ నిర్మాణం కోసం బ్లూబెల్స్ స్కూల్ పక్కన సంధి రహదారి వెంబడి డ్రైనేజీని తవ్వి ఏలాంటి ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయకపోవడం కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు ఆరోపించారు. స్కూల్ పక్కనే పిల్లలు వందలాది మంది రోజు వస్తూపోతుంటారని స్కూల్ పక్కన కనీస హెచ్చరికలు లేకుండా పనులు చేయడం పూర్తిగా బాధ్యతారాహిత్యంగా ఉందని దీనిపై మున్సిపల్ అధికారులు వెంటనే సమాధానం చెప్పాలన్నారు. ఒక రోడ్డును తవ్వినప్పుడు ఏలాంటి బోర్డు లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలకు ఏమైనా జరిగితే పూర్తి బాధ్యత కాంట్రాక్టర్ భరించాల్సి వస్తుందని వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో కాంట్రాక్టర్‌పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని పైడిపల్లి రాజు హెచ్చరించారు.

# 15 ఏళ్లకు బస్సు పునరుద్ధరణ



### ఎన్నో ఏళ్ల కల సాకారం..!

### బస్సు సర్వీసును ప్రారంభించిన మంత్రి అడ్లూరి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని అబ్బాపూర్ గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న బస్సు సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి . రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో 15ఏళ్ల తరువాత ఆర్టీసీ బస్సు పునరుద్ధరణకు నోచుకుంది.జగిత్యాల నుంచి వెల్గటూర్ మండల కేంద్రానికి వయా గొల్లపల్లి, చిల్వాకోడూర్, అబ్బాపూర్ మీదుగా వెల్గటూర్ వరకు బస్సు సర్వీసు నడిచేది. 2015లో బస్సు సర్వీసు రద్దు చేయబడింది . బస్సు రద్దు చేయడం వల్ల,గ్రామ ప్రజలు విద్య ,ఉద్యోగం ,వ్యాపారం ,వైద్య అవసరాలు తదితర కారణాలతో ప్రతిరోజు వివిధ పట్టణాలకు ప్రయాణిస్తుంటారు .అయితే బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు . తిరిగి బస్సు ప్రారంభించాలని స్థానికులు మంత్రి లక్ష్మణ్ కుమార్ ను కలిసి సమస్యను వివరించారు . గ్రామ ప్రజలకు బస్సు సేవలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల అవసరాలను అర్థం చేసుకున్న మంత్రి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించి ప్రత్యేక చొరవ తీసుకొని బస్సు సౌకర్యం తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు.దీంతో మంత్రి అడ్లూరి మంగళవారం అబ్బాపూర్ గ్రామంలో కొత్త బస్సు సర్వీసును జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బస్సు సౌకర్యం కోసం గ్రామస్థులు పలు సందర్భాల్లో తమకు విజ్ఞప్తి చేశారని తెలిపారు. గ్రామస్తుల కోరిక మేరకు బస్సు సౌకర్యం తిరిగి అందుబాటులోకి తెచ్చామని మంత్రి తెలిపారు. స్థానికులు బస్సు సౌకర్యం ఉపయోగించుకోవాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ పార్మార్ ను మంత్రి ప్రారంభించారు. గ్రామంలో మూతబడిన పాఠశాల తిరిగి పునరుద్ధరించగా మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ భీమ సంతోష్ ,వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి,మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాపల్లి గంగన్న ,ముస్కు నిశాంత్ రెడ్డి , పాల్గొన్నారు.

**నూతన బస్సు సర్వీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

**ధర్మపురి :** ధర్మపురి పుణ్యక్షేత్రం నుండి నూతనంగా ప్రారంభించిన ఆర్టీసి బస్సు సర్వీసు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపు నిచ్చారు. ధర్మపురికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం ధర్మపురి నుంచి నిర్మల్, కరీంనగర్ కు రెండు కొత్త బస్సు సర్వీసులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం ధర్మపురి బస్టాండ్ లో ప్రారంభించారు.ఉదయం 7గంటలకు నిర్మల్ నుంచి దస్తురాబాద్,కడెం,ఖానాపూర్ మీదుగా ధర్మపురి వస్తుందని మంత్రి వివరించారు. రోజుకు రెండు ట్రిపుల చొప్పున నిర్మల్ – ధర్మపురి మధ్య బస్సు నడుస్తుందని మంత్రి అడ్లూరి తెలిపారు.అదేవిధంగా ధర్మపురి నుంచి జగిత్యాల మీదుగా ప్రయాణం కష్టంగా ఉన్న నేపథ్యంలో రాయపట్నం, వెల్గటూర్, ధర్మారం, చొప్పదండి మీదుగా కొత్త బస్సు సర్వీస్ ను ప్రారంభించినట్లు మంత్రి వివరించారు. కొత్త సర్వీస్ ఉదయం 7గంటలకు జగిత్యాల నుంచి బయలుదేరి ధర్మపురి, రాయపట్నం, వెల్గటూర్, ధర్మారం మీదుగా కరీంనగర్ చేరకుంటుందని మంత్రి అడ్లూరి తెలిపారు. ఈ కార్యక్రమంలోజిల్లా గంధ్రాలయ సంస్థ చైర్మన్ సంగన బట్ల దినేష్, కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య, నాయకులు వేముల రాజేశ్ తోపాటు ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు, జగిత్యాల డిపో మేనేజర్ రమేష్, నిర్మల్ డిపో మేనేజర్ పండరి,ఆర్టీసీ జగిత్యాల సీఐ శ్రీనివాస్, ఎఫ్ ఎం నిర్మల్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## భారీ స్కామ్‌ను ఛేదించిన సుల్తానాబాద్ పోలీసులు



### 158. 45 కోట్ల స్కామ్ చేసిన కేటుగాళ్లు

### చాకచక్యంగా నిందితులను పట్టుకున్న పోలీసులు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** రైస్ మిల్లుల నిర్వహణ పేరుతో రాష్ట్ర ఖజానాకు భారీగా గండి కొట్టి 158.45 కోట్ల రూపాయలను స్కామ్ చేసిన ఇద్దరు రైస్ మిల్లర్లను సుల్తానాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం సుల్తానాబాద్ పోలీస్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ భూక్య రామ్ రెడ్డి వివరాలను వెల్లడించారు. కరీంనగర్ కట్టరాంపూర్ భగత్ నగర్కు చెందిన సౌభాగ్య లక్ష్మి ఇండస్ట్రీస్ యజమాని బండారి మారుతీ, అతని భాగస్వామిగా ఉన్న సౌఖ్యం అంజయ్యలు హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం కన్నూరు గ్రామం నివాసిలు. వీరిద్దరూ కలిసి తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్తో సీఎంఆర్ ధాన్యం ఒప్పందాన్ని కుదుర్చుకొ ని, 2023 సంవత్సరంలో 3116.360 మెట్రిక్ టన్నులు, 2024 లో 2119.125 మెట్రిక్, టన్నుల బియ్యం ప్రభుత్వానికి అందించాల్సి ఉండగా, నిధుల దుర్వినియోగం, అక్రమ వి క్రయాలకు పాల్పడ్డారని తెలిపారు.కేవలం 515.558 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అందించి, మిగతా 1603.967 మెట్రిక్ టన్నుల సిఎంఆర్ బియ్యాన్ని డెలివరీ చె యకుండా ఎగనామం పెట్టారన్నారు. బ్యాంకుల వద్ద రైస్ మిల్లుల పేరుతో అప్పులు తీసుకోవడం, సివిల్ సప్లై అధికారులకు తెలియకుండా ప్రభుత్వ ధాన్యాన్ని నిందితులు బహిరంగం మార్కెట్లో విక్రయిస్తున్నారన్నారు.2020, 2025 సంవత్సరంలో హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ అధికారులతోపాటు పెద్దపెల్లి జిల్లా పౌరసరఫరాల అధికారులు నిల్వల తనిఖీలలో 1088.014 వరి ధాన్యం తక్కువ ఉన్నట్లు విచారణలో అధికారులు గుర్తించారు. బాధితుడి అభ్యర్థన మేరకు తొంబై రోజులతోపాటు మరో మూడు నెలల గడువు ఇచ్చిన, ఇద్దరు నిందితులు అధికారులను నమ్మించి ఏడు కోట్ల నష్టం చేశారని తెలిపారు.బండారి మారుతిపై గతంలో వివిధ పోలీస్ స్టేషన్లలో మర్డర్ కేసు, అటెంప్ట్ మర్డర్, మోసాలు తదితర కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. నిందితులు బండారి మారుతి, సౌఖ్యం అంజయ్య కోసం గాలింపు చర్యలు చేపట్టుతుండగా సోమవారం కరీంనగర్ కట్టరాంపూర్ జిమ్ములో ఇద్దరు నిందితులను సుల్తానాబాద్ సిఐ రంజిత్ రావు ఆధ్వర్యంలో ఎస్ఐలు చాక చక్యంగా పట్టుకొని సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్కు తరలించారు. కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను రిమాండ్కు తరలిస్తున్నట్లు డిసిపి రామ్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఏ సీబీ కృష్ణ, సీఐ రంజిత్ రావు, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు చంద్రకుమార్, మధుకర్, మల్లేష్, సనత్ రెడ్డి అదనపు ఎస్సై అశోక్ రెడ్డి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పంట మార్పిడి చేసి సన్న వడ్లను సాగు చేయాలి

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** పంట మార్పిడి చేసి రైతులు సన్న వడ్లను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాల కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ రైతు వేదిక ఆవరణలో మొక్కను నాటి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాలయాల్లో మధ్యాహ్న భోజనం, హాస్టళ్లలో సన్న బియ్యం వినియోగిస్తున్నారని, అలాగే రేషన్ షాప్ లలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో స్వల్పకాలం పంటలు వేయాలని, రాష్ట్ర వ్యవసాయ శాఖ సూచించిన బీపీటీ 5204, కేఎన్ఎం 7715, జైశ్రీరామ్, ఆర్ఎన్ఆర్ 15048, డబ్ల్యూజీఎల్ 44, కేఎన్ఎం 1638, హెచ్ఎంటీ సోన సన్న వడ్లు సాగుచేయాలని సూచించారు. లైసెన్స్ కలిగి ఉన్న విత్తన షాప్‌ల నుండి విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసి, రసీదులు పొందాలని, వాటిని జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని పేర్కొన్నారు. రైతులు వరి పంట మీదనే ఆధార పడకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని, అధిక దిగుబడి సాధించేందుకు ఆయిల్ పామ్ సాగు చేయాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో 30 ఏండ్ల వరకు దిగుబడి వస్తుందని, సబ్సిడీపై మొక్కలు, బిందు సేద్యం పరికరాలు అందిస్తున్నామని అన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు సిద్దిపేట జిల్లా నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ప్రారంభించారని గుర్తుచేశారు. మూడు ఏండ్ల తరువాత దిగుబడి వచ్చే ఆయిల్ పామ్ సాగులో అంతర పంటలు సాగు చేయవచ్చని, దీనితో అదనపు ఆదాయం పొందవచ్చని అన్నారు. సహజ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, రైతులు ఆ వైపు మాళ్లాలని, దీనిపై అవగాహన కల్పించేందుకు ఇక్కడ సిబ్బంది ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, మండల ప్రత్యేక అధికారి క్రాంతి, తహసీల్దార్ నారాయణరెడ్డి, సర్పంచ్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.



# మానేరులో అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం

## జ్యోతి వెలిగించి ప్రారంభించిన చైర్మన్ అనంతరెడ్డి



**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ పద్మనగర్ లోని మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో మానేరు విద్యా సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా మానేరు విద్యా సంస్థల అధినేత కడారి అనంతరెడ్డి ఒలింపిక్ టార్చిని వెలిగించి ఒలింపిక్ విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఒలింపిక్ ఐదు రంగుల రింగులను ప్రదర్శిస్తూ ఉత్సాహంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధృఢత్వానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థి దశ నుంచే విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. మానేరు విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు నిరంతరం ప్రోత్సహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్స్, తిరుపతి, స్వామి, అఖిల తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డా.శ్యాంప్రసాద్ ముఖర్జీ 125వ వర్ధంతి వేడుకలు

**ప్రజాపక్షం / మానకొండూర్ :** భారతీయ జనతా పార్టీ మానకొండూర్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భారత జాతీయవాది, విద్యావేత్త, దేశభక్తుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ 125వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ డా.శ్యాంప్రసాద్ ముఖర్జీ భారతదేశ సమగ్రత, ఏకత్వం కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడని కొనియాడారు. భారతీయ జనసంఘ స్థాపకులలో ఒకరైన ఆయన దేశంలో ఒకే రాజ్యాంగం, ఒకే జెండా, ఒకే ప్రధాన మంత్రి ఉండాలనే సిద్ధాంతంతో కాశ్మీర్‌లో ప్రత్యేక హోదాకు వ్యతిరేకంగా ఉద్యమించారని అన్నారు. ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధాన మంత్రులు ఉండరాదు అనే నినాదంతో దేశ సమైక్యత కోసం ఆయన చేసినత్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి భారతీయుడు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన చూపిన మార్గంలో నడువాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు ఉప సర్పంచ్ రాపాక ప్రవీణ్, మియాపురం లక్ష్మణచారి, సోన్నాకుల శ్రీనివాస్ వంగల ఆంజనేయులు, బాషబోయిన ప్రదీప్ యాదవ్ శీలం కుమార్, పోచంపల్లి శ్రీనివాస్, ఎదులాపురం అశ్విన్ తేజ, కోల శ్రీనివాస్ తాడూరి కిరణ్ రెడ్డి, నందగిరి బలరాం, ఆరెపల్లి సునంద్ శమంతుల నరేందర్ , సాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

### గంగాధరలో

**ప్రజాపక్షం / గంగాధర :** భారతదేశ ఐక్యత, సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప జాతీయవాది, విద్యావేత్త, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డా.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా గంగాధర మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్ నాయకత్వంలో మహనీయుని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వతంత్ర భారత రాజకీయాలకు సైద్ధాంతిక దిశను చూపించిన మహోన్నత వ్యక్తి డా.శ్యాంప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. దేశ సమగ్రత, జాతీయత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన చేసిన త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, రెండు ప్రధానులు ఉండరాదు అనే ఆయన సిద్ధాంతం భారత ఐక్యతకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్ కుమార్, మాజీ మండల అధ్యక్షులు కోల అశోక్ ఉప సర్పంచ్ గాలిపెల్లి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి తాళ్ల రాజశేఖర్ చేనేత సెల్ కన్వీనర్ శ్రీపతి రాజేంద్ర ప్రసాద్ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఆకుల మనోహర్ మండల కార్యదర్శి పృథ్వీగౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షులు దయ్యాల ప్రణయ్ ప్రధాన కార్యదర్శి అనిల్, బూత్ అధ్యక్షులు వేముల గంగన్న, అనిల్ కుమార్ పెరుక పవన్ కుమార్, పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం / కొత్తపల్లి :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వన్ టౌన్ ఎస్సై సుమన్ రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాల గురించి వివరించారు. నేటి సమాజంలో వివిధ రూపాల్లో మత్తు పదార్థాలు ఎలా అందుబాటులోకి వస్తున్నాయో వాటిపట్ల యువత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని తెలిపారు. మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ చిన్న కూల్‌డ్రింక్స్, జంక్ ఫుడ్ వంటి వాటితో అలవాటయ్యే అనారోగ్య జీవన శైలి క్రమంగా మత్తు పదార్థాలవైపు దారి తీస్తుందని ప్యాకెజ్డ్ ఫుడ్, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తమను తాము కాపాడుకుంటామని వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, డా.చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, కొత్తూరి ముకుందం, డా.నాళ్ల సత్యవిద్యా సాగర్ , డా.ఎలగందుల శ్రీనివాస్ , పుల్లల శ్యామ్, రావర్తి శ్రీనివాస్, నడిపెల్లి దీన్ దయాల్, అప్పిడి వకులదేవి, ఆచార్య బృందం పాల్గొన్నారు.

## రైతు వేదికలో విత్తన మేళా ప్రారంభం



**ప్రజాపక్షం / కొత్తపల్లి :** రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కొత్తపల్లి రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ విత్తనం మేళా నేటి నుంచి ఈనెల 30 వరకు జరుగుతుందని అన్నారు. వ్యవసాయ రంగంలో నాణ్యమైన విత్తనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు సకాలంలో అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు తెలంగాణ ప్రభుత్వం రైతు వేదికల ద్వారా విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సూచించిన 7 వరి సన్న రకాలను రైతులకు అందుబాటులో ఉంచామని నకిలీ విత్తనాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకొని తద్వారా పంట దిగుబడులు పెరిగి రైతుల ఆదాయం పెరిగేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఈ విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిడిఏకె దామోదర్, ఏడిఏ ఓ.ఉష, ఏఓలు అనూష, బి.తిరుమలేశ్వర్ , వేములు కవిత చంద్రశేఖర్, 18వ డివిజన్ కార్పొరేటర్ వాసాల రమేశ్ , రైతులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సేవా కేంద్రం ప్లస్ ప్రారంభించిన బిజినెస్ హెడ్ శ్రీనివాస్



**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ బీమా రంగం వ్యాపారంలోనే కాదు సామాజిక సేవలోనూ తమకు సాటిలేరని నిరూపించుకుంది. కంపెనీ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్)లో భాగంగా కరీంనగర్ సుభాష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఆరోగ్య సేవ కేంద్రం ప్లస్ క్లినిక్ మంగళవారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బిజినెస్ హెడ్ కేబీబీ శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య రక్షణను సామాన్యుడి దరికి చేర్చుతూ రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సంప్రదింపులు, డయాగ్నోస్టిక్ సేవలు, మందులను అందిస్తూ ఈ కేంద్రం సామాన్యులకు కొండం అండగా నిలుస్తోందన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జోనల్ మేనేజర్ కుమార్ గోపు, రీజనల్ మేనేజర్ జీ.సురేశ్‌లు మాట్లాడుతూ కరీంనగర్ ఆరోగ్య సేవ కేంద్రంలో ఇప్పటివరకు 172 పనిదినాల్లో 3600 మందికిపైగా ఉచిత వైద్య సేవలు అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్లు, ఏజెంట్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**ఏఎస్‌కే లో అందించే వైద్య సేవలు**

డాక్టర్ కన్సల్టేషన్ అనువజ్ఞులైన ఎంబిబిఎస్ డాక్టర్ల ద్వారా వ్యక్తిగత కన్సల్టేషన్, నిరంతర ఫాలోఅప్ సేవలు, ఉచిత ల్యాబ్ పరీక్షలు, అత్యాధునిక హేమటాలజీ ఎనలైజర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్, సెంట్రిఫ్యూజ్ , ఈసీజీ వసతులతో కూడిన ఈ కేంద్రంలో సిబిపి, సీఆర్పి, బ్లడ్ షుగర్, హిమోగ్లోబిన్, ఆర్‌డిటి పరీక్షలు పూర్తిగా ఉచితం. ఉచిత మందులు, సాధారణ జ్వరాలు, డయాబెటిస్, హైపర్‌టెన్స్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఉచితంగా మందుల పంపిణీ. వ్యాక్సినేషన్ అండ్ కౌన్సిలింగ్ అర్హులైన లబ్దిదారులకు ఉచిత అడల్ట్ ఫ్లూ, మోకాకల్ వ్యాక్సిన్ సరఫరా, నోటి ఆరోగ్య స్క్రీనింగ్ నిపుణులతో హెల్త్ కౌన్సిలింగ్ అవగాహన సదస్సులు. రోగుల సంరక్షణ కోసం వైద్యుల బృందం నిరంతర సేవలు అందిస్తోంది. అపాయింట్మెంట్ల కోసం 9247573114 నంబర్‌లో సంప్రదించవచ్చు.

## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం / గంగాధర:** మాదక ద్రవ్యాల నిర్మూలన, యువతలో అవగాహన పెంపొందించేందుకు గంగాధర ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం గట్టుభూత్కూర్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, క్రీడల్లో , సృజనాత్మక కార్యక్రమాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ అంశంపై వ్యాస రచన, పెయింటింగ్, చిత్ర లేఖనం, వాలీబాల్‌తోపాటు వివిధ పోటీ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సన్న వరి విత్తనాలు పంపిణీ

**ప్రజాపక్షం / గంగాధర:** గంగాధర మండలం కురిక్యాల గ్రామంలోని రైతు వేదికలో వానాకాలం సీజన్ సందర్భంగా మంగళవారం విత్తన మేళా ఘనంగా ప్రారంభించారు. రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాల కార్యక్రమాన్ని ప్రారంభించి సబ్సిడీపై రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ మేళా ఈనెల 23 నుంచి 30 వరకు కొనసాగనుంది. స్థానిక సర్పంచ్ కడారి రేణుక కనుకయ్య, ఉప్పర మల్యాల సర్పంచ్ ముద్దం నగేశ్ లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తామన్నారు. ఈ మేళాలో ప్రభుత్వం గుర్తించిన 7 రకాల పప్పు ధాన్యాల విత్తనాలు, నానో యూరియా, నానో డిఏపి లను రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కురిక్యాల ఉప సర్పంచ్ గుండారపు మహేశ్, ఏఈవో వెంకట్ , ఫర్టిలైజర్ షాప్స్ డీలర్స్ , రైతులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం / కరీంనగర్‌టౌన్ :** గంగాధర మండలం ఉప్పర మల్యాల గ్రామానికి చెందిన లంకదాసరి మల్లయ్య ఇటీవల ప్రమాదంలో గాయపడి కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తోటి విద్యార్థి తండ్రి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని ఉప్పరమల్యాల గ్రామ జడ్పీహెచ్ఎస్ స్కూల్ 20072008 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులంతా కలిసి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం తమవంతుగా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటి విద్యార్థి బాధను షేర్ చేసుకోవడం సంతోషంగా ఉందని త్వరలోనే ఆయన కోలుకోవాలని ఆకాంక్షించారు.

## చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** కరీంనగర్ రూరల్ పోలీసులు చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి చోరీ సొమ్ము, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఫిర్యాదుదారు బొంత కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తాను తన భార్య కూలీ పనులకు వెళ్లిన సమయంలో తన ఇంట్లో ఉన్న స్టీల్ గల్లాపెట్టెలోని నగదును బంకల ప్రభుకుమార్ (27) చోరీ చేసినట్లు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు దర్యాప్తులో భాగంగా నిందితుడు తేజలగూడ గ్రామ సమీపంలోని రైల్వే గేట్ వద్ద ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ.4 వేల నగదు, చోరికి సంబంధించిన స్టీల్ గల్లా పెట్టెను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

# బాధిత కుటుంబానికి అండగా మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పోతారాం గ్రామానికి చెందిన నీలం రవళి భర్త శ్రవణ్ కుమార్ కి వైద్య చికిత్స నిమిత్తం తెలంగాణ రాష్ట్ర ఐటీ, శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రూ. 1,50,000 ఒక లక్షా యాభై వేల ఎల్ఓసీ మంజూరు చేయించారు.గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవళి కుటుంబ సభ్యులు, తమకు వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం చేయాలని మంత్రి శ్రీధర్ బాబును ఆశ్రయించారు. వారి పరిస్థితిపై మంత్రి తక్షణమే స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 1.50 లక్షల ఎల్ఓసీని అత్యంత వేగంగా మంజూరు చేయించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన ఆసుపత్రి సహాయకులు లబ్దిదారురాలి కుటుంబ సభ్యులకు ఈ ఎల్ఓసీని అందజేశారు. కష్ట కాలంలో తమకు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన మంత్రి శ్రీధర్ బాబుకు లబ్దిదారురాలి కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.ధర్మారం మండలంలోని నంది మేడారం గ్రామంలో ఉన్న టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్/జూనియర్ కాలేజీ (బాలికలు) పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారికి అందిస్తున్న ఆహార నాణ్యత, వసతులను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతను అత్యుత్తమంగా నిర్వహించాలని సూచించారు. పాఠశాల ప్రాంగణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి విద్యార్థి శారీరక ఎదుగుదల, విద్యా ప్రగతి, క్రీడలు, ఇతర సహపాఠ్య కార్యక్రమాల్లో పాల్గొనే తీరును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించడంతో పాటు ఆహార పదార్థాలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిల్వ చేయాలని సూచించారు. వంట ప్రక్రియను పరిశుభ్రత ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించి, విద్యార్థులకు రుచికరమైన,పోషక విలువలతో కూడిన ఆహారం అందేలా చూడాలని ఆదేశించారు.అనంతరం ధర్మారం ఎంపీడీవో కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమయపాలన పాటించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో ధర్మారం తహసిల్దార్ శ్రీనివాస్,టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్ ప్రిన్సిపాల్ పద్మ,తదితర అధికారులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

**ప్రజాపక్షం/కొడిమ్యాల:** కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల యన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎస్ఐ అనుమండ్ల నరేష్ కుమార్ గారు మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ కు, గంజాయి కి దూరంగా ఉండాలని, చదువు పై శ్రద్ధ వహించి మంచి ఉద్యోగం సాధించాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపాల్ మాట్లాడుతూ డ్రగ్స్ బానిస కావద్దు అని, ఒక్కసారి సేవిస్తే దానికి బానిస అయ్యే అవకాశం ఉంటుంది అని తెలిపి, విద్యార్థులు చదువు పై శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి. భాస్కర్, సీనియర్ అధ్యాపకులు కె. వేణు,జయపాల్ రెడ్డి, స్టూడెంట్ కౌన్సిలర్ పి. తిరుపతి మరియు అధ్యాపకులు విద్యార్థులు ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రభుత్వ స్థలాల పంపిణీకి ప్రభుత్వ భూముల సర్వే వేగవంతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఇదివరకు గవర్నమెంట్ అర్హులైన పేదలకు ఇచ్చిన ప్రభుత్వ స్థలాల పంపిణీకి ప్రభుత్వ భూముల సర్వే వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.కాల్వ శ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం సందర్శించి ఎంపీడీవో, తహసీల్దార్ తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెన్నంపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూముల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన పేదలకు ఇదివరకు ఇచ్చిన ప్రభుత్వ స్థలాలకు పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని తెలిపారు. పెద్దంపేట గ్రామంలో గోదాం నిర్మాణం కోసం గుర్తించిన 10 ఎకరాల భూమికి సంబంధించిన ప్రక్రియను త్వరగా పూర్తి చేసి భూమిని ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవోకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ముత్తారం మండలంలోని ఓడేడు శివారులోని వెంకటేశ్వర్లపల్లి గ్రామ పరిధిలో* సీలింగ్ భూములను పరిశీలించారు.భూముల స్థితిగతులను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో కాల్వ శ్రీరాంపూర్ తహసీల్దార్డా.రాముడు ,ముత్తారం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, కాల్వ శ్రీరాంపూర్ ఇంచార్జ్ ఎంపీడీవో దివ్యదర్శన్ రావు,తదితర అధికారులు పాల్గొన్నారు.

## అటవీ-రెవెన్యూ భూ వివాదాల పరిష్కారానికి కార్యాచరణ చేపట్టాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలో అటవీ, రెవెన్యూ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన డిఎల్ఎఫ్‌పిసి (జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ) సమావేశంలో డీసీపీ రామ్ రెడ్డి,అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక రవాణా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే జరగాలని సూచించారు. ఇసుక తవ్వకాల అనుమతులకు సంబంధించి రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సంయుక్త సర్వే నిర్వహించాలని ఆదేశించారు.రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి సంయుక్త తనిఖీలు చేపట్టి పూర్తి స్థాయి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల కోసం అవసరమైన అటవీ భూములకు సంబంధించిన ప్రతిపాదనలను ఈ నెల 30వ తేదీలోగా సమర్పించాలని సూచించారు.గెజిట్‌లో నమోదైన కొన్ని పోడు భూముల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో బి. గంగయ్య, ఇన్‌చార్జి డీఎఫ్‌వో నవీన్ రెడ్డి,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి మండలంలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల మెరుపుదాడులు



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వలను అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఆదేశాలమేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం కొత్తపల్లి మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసీఫ్‌నగర్ గ్రామ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన 3 భారీ ఇసుక డంపులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. సీజ్ చేసిన ఈ మూడు డంపుల్లో 75 ట్రాక్టర్ల లోడుల ఇసుక ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న ఇసుక నిల్వలను తదుపరి చర్యల నిమిత్తం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. అదేవిధంగా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. సదరు ట్రాక్టర్‌ను చట్టపరమైన చర్యల నిమిత్తం రూరల్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తవ్వడం నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాపై కమీషనరేట్ వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని నిబంధనలను ఉల్లంఘించేవారిపై మైనింగ్ చట్టాలు, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సురేందర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దేశ ఐక్యత కోసం ఆయన చేసిన త్యాగం భావితరాలకు స్ఫూర్తి

**ప్రజాపక్షం/చొప్పదండి :** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ ను మండల కేంద్రంలో బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సమైఖ్యత, జాతీయత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం శ్యాంప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశ ఐక్యత కోసం ఆయన చేసిన త్యాగం భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ గౌడ్ , కౌన్సిలర్ జిట్ట మంగ కుమార్, మాజీ పట్టణ అధ్యక్షులు బత్తిని ప్రశాంత్, పాల్గొన్నారు.

## రైతు వేదికలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనమేళా

**ప్రజాపక్షం/జమ్మికుంట :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు మండలంలోని బిజిగిరి షరీఫ్, మడిపల్లి, ఆబాదీ జమ్మికుంట రైతు వేదికలలో విత్తన మేళా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వం సూచించిన 7 సన్న రకాల వరి విత్తనాలు నుంచి జమ్మికుంట మండలంలో అందుబాటులో ఉన్న రకాలను మూడు రైతు వేదికల నందు సంబంధిత విత్తన డీలర్ల ద్వారా అమ్మకాలు జరపడం జరుగుతున్నాయని మండల వ్యవసాయ అధికారి షక్ ఖాదర్ హుస్సేన్ తెలిపారు. రైతులు తమకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ఒకేచోట కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించడం కోసం ఇట్టి సదుపాయం ఏర్పాటు చేయడం జరిగిందని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## ఆర్డిఓను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కరీంనగర్ ఆర్డీవో షర్మిలను మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పూలబోకే అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం మార్కెట్ యార్డు అభివృద్ధి, రైతులకు అందిస్తున్న సేవలు, ప్రజా సమస్యలు తదితర పలు అంశాలపై ఆర్డీవోతో చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో చేయాల్సిన అవసరం ఉందని ఆకుల నరసన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు కాశెట్టి శ్రీనివాస్, వేల్పుల వెంకటేశ్ పడాల అజయ్, శ్రీనివాస్ , కనకరాజు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మత్తు పదార్థాలపై ఎస్ఐ చిరంజీవి అవగాహన

**ప్రజాపక్షం/కోరుట్ల :** నేటి పౌరులే...రేపటి భవిష్యత్తు..ఉన్నత భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాల్సిన యువత, గంజాయి మత్తులో తమ ఉన్నత భవిష్యత్తును చిత్తు చేసుకుంటున్నారు. సరదాగా సిగరెట్ల మత్తులో నుండి మొదలైన ప్రయాణం గంజాయి నిషాలో వ్యసనంగా మారుతుందని కోరుట్ల సబ్ ఇన్స్పెక్టర్ ఎమ్.చిరంజీవి అన్నారు.జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, కోరుట్ల,మెట్‌పల్లి డి.ఎస్.పి ఏ రాములు పర్యవేక్షణలో, కోరుట్ల సీఐ కే లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో , గంజాయి మరియు మత్తు పదార్థాల పై అవగాహన సదస్సు కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోరుట్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గంజాయి మరియు మాదక ద్రవ్యాల పై అవగాహన సదస్సు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గౌస్ ఉర్ రెహమాన్, సాహితీ మేడం ఇతర లెక్చరర్స్ మరియు సుమారు 200 మంది విద్యార్థిని విద్యార్థులు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రైతువేదికలో కంది విత్తనాల పంపిణీ

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట రైతు వేదికలో విత్తనమేల కార్యక్రమంలో భాగంగా రైతులకు కంది విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారిని లావణ్య మంగళవారం పంపిణీ చేశారు. కంది పంట రైతులకు ఉంటుందని ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ లు వినీత వైష్ణవి, ఆత్మ కమిటీ చైర్మన్ వాకిటి భూమారెడ్డి, రమేష్ ,రాజన్న ,రాజేందర్ ,రాములు, పెద్దిరెడ్డి ,లావణ్య ,సులోచన, తదితరులున్నారు.

# రైతులు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** రైతుల సంక్షేమం ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని ఇబ్రహీం నగర్ (శ్రీరాములపల్లి) రైతు వేదిక లో మంగళవారం విత్తన మేళా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత యాసంగి సీజన్ లో పెద్ద ఎత్తున వారి ధాన్యం, మొక్కజొన్న దిగుబడి వచ్చిందని అన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి రికార్డు స్థాయిలో ధాన్యం, మక్కలు కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. కొనుగోలు చేసిన నాలుగు ఐదు రోజుల లోపు డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తెలిపారు. ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం సహకరించకున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. వానాకాలం సీజన్ లో రైతులు సన్న వడ్ల బోనస్కు అర్హత కలిగిన ప్రభుత్వం సూచించిన ఏడు రకాల విత్తనాలు



మాత్రమే రైతులు సాగు చేయాలని మంత్రి అడ్లూరి కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## సుల్తానాబాద్ మండల కేంద్రంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** దేశ సమైక్యత కోసం తన ప్రాణాలను అర్పించిన మహోన్నత వ్యక్తి డా. శ్యామాప్రసాద్ ముఖర్జీ అని మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్, కందుల శ్రీనివాస్,మన్ కీ బాత్ జిల్లా కన్వీనర్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ లు అన్నారు.సుల్తానాబాద్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, గొప్ప జాతీయవాది, దేశ సమైక్యత కోసం తన ప్రాణాలను అర్పించిన డా. శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డా. శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్, కందుల శ్రీనివాస్ మన్ కీ బాత్ జిల్లా కన్వీనర్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ లు మాట్లాడుతూ, దేశంలో ఏక్ దేశ్ – ఏక్ నిషాన్ – ఏక్ విధాన్ సిద్ధాంతం కోసం పోరాడిన మహనీయుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ అని అన్నారు.జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దుకు ఆయన చేసిన త్యాగం,పోరాటం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం ఆయన చేసిన సేవలు ప్రతి భారతీయుడికి ఆదర్శమని, యువత ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాలు సాకారమవుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కోట నాగేశ్వర్,మెండే శంకరయ్య,మల్లు భాగ్యలక్ష్మి ,కొమ్మిడి రాజేందర్ రెడ్డి,భూషణవేణి మనోహర్,బండారి లత, పెరక రమేష్ పటేల్, ఎనగందుల ఎల్లయ్య, దాసరి చందు పటేల్, సొట్టు నరేష్, శాలిగంటి కొముర‌య్య, చట్టవేణి సదయ్య, శేఖర్ మాస్టర్, ఇరుకొండ పర్శరాములు, దశరథమ్, పాల్గొన్నారు.

## యువత యాంటీ డ్రగ్ సోల్జర్స్'గా ముందుకు రావాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** డ్రగ్స్ ను పూర్తిగా నిర్మూలించాలంటే యువత యాంటీ డ్రగ్ సోల్జర్స్ గా ముందుకు రావాలని పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి పిలుపునిచ్చారు.జూన్ 22 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా,జూన్ 26న నిర్వహించనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు, కమాన్‌పూర్ ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జోన్‌లోని కమాన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరి ఖని ఏసీపీ ఎం.రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నాయకత్వంలో డ్రగ్స్ నిర్మూలనను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని తెలిపారు. ఈ లక్ష్యంతో ప్రత్యేకంగా డీజీ స్థాయి అధికారితో "ఈగల్" విభాగాన్ని ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే,కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ సోల్జర్ సెల్ఫీ పాయింట్ వద్ద విద్యార్థులు ఫోటోలు దిగారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ యాంటీ డ్రగ్ సోల్జర్‌గా మారి సమాజంలో అవగాహన కల్పించాలని,డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని డీసీపీ బి.రామ్ రెడ్డి,ఏసీపీ ఎం.రమేష్ పిలుపునిచ్చారు.



## పెట్రోల్ బంక్ ప్రతిపాదనను విరమించుకోవాలి

**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో పెట్రోల్ బంక్ ప్రతిపాదనను విరమించుకోవాలి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ కు లేఖ రాశారు. జగిత్యాల పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండటంపై ఆయన స్పందించారు. ఇప్పటికే తహసీల్ చౌరస్తా ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, ఈ నేపథ్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ సముదాయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, జగిత్యాల అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన జనాభా ప్రాతిపదికన మరో పట్టణ తహసీల్దార్ కార్యాలయం కూడా మంజూరయ్యే అవకాశం



ఉన్నందున ప్రజల రాకపోకలు మరింత పెరిగే అవకాశముందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం వల్ల వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్ సమస్యలు, భద్రతా సమస్యలు తలెత్తే అవకాశముందని పేర్కొన్నారు. మరోవైపు పాత బస్టాండ్ సమీపంలోని పోలీస్ క్వార్టర్స్ స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసే ప్రతిపాదన కూడా ఉన్నట్లు తెలిసిందని, అక్కడ రహదారి వెడల్పుగా ఉండటంతో వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉండటమే కాకుండా ట్రాఫిక్ ఇబ్బందులు తక్కువగా ఉంటాయన్నారు.అందువల్ల తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు విషయమై ఏవైనా ప్రతిపాదనలు ఉంటే ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వాటిని నిలిపివేయాలని కలెక్టర్ కు రాసిన లేఖలో పేర్కొన్నారు.

## విద్యార్థులు 'యాంటీ డ్రగ్ సోల్జర్స్'గా సమాజంలో అవగాహన కల్పించాలి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** విద్యార్థులు 'యాంటీ డ్రగ్ సోల్జర్స్'గా సమాజంలో అవగాహన కల్పించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విద్యార్థులకు సూచించారు.జూన్ 22 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన వారోత్సవ కార్యక్రమాల్లో భాగంగా,జూన్ 26న నిర్వహించనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఎగెనెస్ట్ డ్రగ్ అబ్యూస్ అండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ ) సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం గర్రెపల్లి సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో సుల్తానాబాద్ సీఐ రంజిత్ కుమార్,ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, పాఠశాలలో విద్యార్థులు క్రమశిక్షణతో ఉండటం అభినందనీయమని అన్నారు.విద్యార్థుల్లో మంచి విలువలు, క్రమశిక్షణ ఉన్నప్పుడు వారు ఎప్పటికీ మత్తు పదార్థాల బారిన పడరని పేర్కొన్నారు.



ఇందుకు కృషి చేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందించారు.విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని సూచించారు.తమ గ్రామాలు, కాలనీలు, పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ 'యాంటీ డ్రగ్ సోల్జర్స్'గా ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ సీఐ రంజిత్ కుమార్, పెద్దపల్లి నార్కోటిక్ టీం ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, ఎస్సై చంద్రకుమార్, జూలపల్లి ఎస్సై మల్లేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు ఆధునిక సాగు, విత్తనమేలపై అవగాహన

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల రైతులకు నిర్వహించిన విత్తన మేళా పై మంగళవారం వ్యవసాయ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఆకు రాజకుమార్ మాట్లాడుతూ వరి వంగడాలు, నానో యూరియా, నానో డీఏపీ పై అవగాహన కల్పిస్తూ రైతులు నాణ్యమైన విత్తనాలు, ఆధునిక సాంకేతికతలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి,సర్పంచ్‌లు బండి రాజేష్,పోసకంటి చిన్న వెంకట్,ఏఈఓలు వినోద్,సాగర్, రావళిక, సాయికృప, విత్తన డీలర్లు, కంపెనీ ప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలపై యువతకు అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/బీర్పూర్:** జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో మాదకద్రవ్యాల నిర్మూలన పై అవగాహన సదస్సు లో మాదకద్రవ్యాల యువకుల కు గంజాయి అనర్థాలపై అవగాహన కార్యక్రమం బీర్పూర్ ఎస్సై రాజు నిర్వహించారు.గంజాయి ఇతర డ్రగ్స్ త్రాగడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, దాని ద్వారా బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని యువకులకు తెలియజేశారు.మంచి అలవాట్లతో మంచి భవిష్యత్తు ఉంటుందని వారికి తెలియజేశారు.యువతపై వారి తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకొని జీవిస్తారని వారికి తెలియజేసి ఎవరు కూడా వారి తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని చెడు అలవాట్లు కు గురికాకుండా ఉండాలని తెలియజేశారు. ఎవరైనా గంజాయి కి అలవాటు పడిన, గంజాయి అమ్మిన,కొన్న, పోలీస్ వారికి తెలియజేయాలని చెప్పారు. బీర్పూర్ పోలీస్ స్టేషన్ నెంబర్ 8712656828 కి తెలియపరచాలని చెప్పారు. యువత ముఖ్యంగా ధూమపానం మద్యం గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని ఘంటా పథంగా చెప్పారు.గంజాయి నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ధర్మపురి నృసింహ ఆలయంలో హుండీల లెక్కింపు

**ప్రజాపక్షం/ధర్మపురి :** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం, జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మి నృసింహస్వామి దేవస్థానంలో మంగళవారం హుండీల లెక్కింపు జరిపారు. మార్చి 10 నుండి ఈనెల 23 వరకు 105 రోజులకు సంబంధించిన హుండీ ఆదాయం చేపట్టగా రూ.73,82,239 నగదు, మిశ్రమ బంగారం 38 గ్రాములు, మిశ్రమ వెండి 4 కిలోల 500 గ్రాములు, 22 విదేశీనోట్లు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ, ఈఓ సంకటాల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన విద్యార్థులు పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించినందుకు మంగళవారం మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్ శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందాన్ని కూడా అభినందించారు. అనంతరం దేవేందర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భూపతి, జంగిలి అశోక్, వనిత, రాజేంద్రప్రసాద్, సుమతి, ఉదయశ్రీ, స్వామి, భూలక్ష్మి , విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజెన్లకు సర్కారు భరోసా

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జన్మనిచ్చిన తల్లి దండ్రులు వృద్ధాప్యంలో నిరాదరణకు గురికాకుండా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తల్లి దండ్రుల భద్రత చట్టం 2026 తెచ్చిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వయోధికుల వేధింపుల నివారణకు అవగాహన పక్షోత్సవాల సందర్భంగా టాస్క్ ముద్రించిన అవగాహన పిలుపు పత్రికలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వం తరపున తన వినతి మేరకు,మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో వృద్ధాశ్రమము నిర్మాణం పూర్తయ్యిందని త్వరలో అందుబాటులోకి వస్తుందని,అల్పాహారం, వైద్య సేవలు, వినోదకార్యక్రమాల కోసం డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయించామన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాథం, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. హన్మంత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, ఎం. డి. యా కూబ్, కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు,పల్లి అధ్యక్షులు వొజ్జల బుచ్చి రెడ్డి,బొబ్బాటి కరుణ, విజయ లక్ష్మి ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



**ప్రజాపక్షం / కోటపల్లి :** ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఎబివిపి) ఆధ్వర్యంలో కోటపల్లి మండల పరిధిలోని గ్రామాల్లో పాఠశాలల బంద్ నిర్వహించారు. ఈ బంద్ కార్యక్రమానికి కోటపల్లి మండల బిజెపి శ్రేణులు పూర్తి మద్దతు ప్రకటించి పాల్గొన్నాయి. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందించేలా చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి మండల బిజెపి జనరల్ సెక్రెటరీ కందుల వెంకన్న, టౌన్ ప్రెసిడెంట్ సుందిళ్ల సాయికుమార్, బూత్ అధ్యక్షుడు కాశెట్టి రాకేష్, బిజెపి సీనియర్ నాయకుడు షేగం చంద్రయ్య పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం /మంచిర్యాల టౌన్ :** వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బికెఎంయు) ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ వడాల రాములు (రెవెన్యూ)కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బికెఎంయు జాతీయ సమితి సభ్యులు అక్కెపల్లి బాపు, జిల్లా కార్యదర్శి గుండా చంద్ర మాణిక్యం మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి ప్రతి సంవత్సరం రూ.2.5 లక్షల కోట్లు కేటాయించాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు ప్రతి సంవత్సరం 200 రోజుల పని కల్పించాలని, ప్రతి రోజూ రూ.700 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అర్హులైన వ్యవసాయ కార్మికులకు ప్రతి నెల రూ.6 వేల పింఛను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. బికెఎంయు జిల్లా సహాయ కార్యదర్శి బొంతల లక్ష్మి నారాయణ, జిల్లా నాయకులు గుండా శంకర్, రత్నం రాజం పాల్గొన్నారు.

## ఘనంగా విత్తన మేళా

**ప్రజాపక్షం/జన్నారం :** రైతులు సాగులో నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మి నారాయణ, ఇంచార్జి వ్యవసాయాధికారి అంజిత్ కుమార్ తెలిపారు. జన్నారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అంజిత్ కుమార్ అధ్యక్షతన విత్తన మేళా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సిఫార్సు చేసిన ఏడు రకాల వరి వంగడాల ప్రత్యేకతలు, వాటి సాగు విధానాలు, ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. ప్రభుత్వం సూచించిన విత్తనాలను ఉపయోగించడం ద్వారా పంటలకు తెగుళ్ల నివారణతో పాటు మెరుగైన దిగుబడి సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## మాదకద్రవ్యాల మహమ్మారిని దూరం పెట్టాలి

### హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్




**ప్రజాపక్షం / హాజీపూర్ :** యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల మహమ్మారికి దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని హాజీపూర్ సబ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ముల్కల్ల గ్రామంలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల అలవాటు వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుందని హెచ్చరించారు. క్షణికానందం కోసం డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాల బారిన పడి అమూల్యమైన జీవితాలను, తల్లిదండ్రుల ఆశలను నాశనం చేసుకోవద్దని కోరారు. ఒకరు వ్యసనానికి బానిసలైతే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకొని లక్ష్యం వైపు సాగాలని, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. చట్టవ్యతిరేకమైన ఇలాంటి కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని, గ్రామీణ ప్రాంతాల్లో మాదకద్రవ్యాల విక్రయాలు లేదా రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది సత్యనారాయణ, రాజేందర్, తిరుపతి, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూదాన్ భూములను కాపాడి నిరుపేదలకు అందించాలి

### తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షుడు ఆర్ శంకర్ నాయక్



**ప్రజాపక్షం / నస్పూర్ :** మంచిర్యాల జిల్లాలోని వివిధ మండలాల్లో ఉన్న భూదాన్ భూములను వెంటనే గుర్తించి రక్షించాలని, అన్యాక్రాంతమైన భూములను కబ్జాదారుల నుండి స్వాధీనం చేసుకొని నిరుపేదలకు పంపిణీ చేయాలని తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. జిల్లాలోని భూదాన్ భూములను కాపాడాలని కోరుతూ అదనపు కలెక్టర్ వడాల రాములు (రెవెన్యూ)కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూదాన్ భూముల్లో ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని, అక్రమంగా కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భూదాన్ భూముల పరిరక్షణ, నిరుపేదలకు వాటిని దక్కించే పోరాటం కోసం తెలంగాణ సర్వోదయ మండలి మంచిర్యాల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. నూతన జిల్లా అధ్యక్షులుగా మేదరి దేవవరం, ప్రధాన కార్యదర్శిగా మిట్టపల్లి పౌలు, ఉపాధ్యక్షులుగా వనం సత్యనారాయణ, తాళ్ళపల్లి వీరయ్య, సహాయ కార్యదర్శులుగా జోగుల మల్లయ్య, బొంతల లక్ష్మి నారాయణ, కోశాధికారిగా మిరియాల రాజేశ్వర రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గూడెల్లి రాజయ్య, ప్రతినిధిగా మిట్టపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

## పాఠశాలల బంద్ విజయవంతం

### ఎబివిపి రాష్ట్ర నాయకులు పందిరి మనీష్



**ప్రజాపక్షం / జన్నారం :** విద్యా రంగంలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పాఠశాలల బంద్ విజయవంతమైందని ఆ సంఘం రాష్ట్ర నాయకులు పందిరి మనీష్ తెలిపారు. జన్నారం మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ విద్యా మాఫియాకు బ్రాండ్ అంబాసిడర్‌లా వ్యవహరిస్తోందని విమర్శించారు. రేషనలైజేషన్ పేరుతో రాష్ట్రంలోని 23 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదని, ఫీజుల దోపిడీకి రెడ్ కార్పెట్ పరుస్తోందని మండిపడ్డారు. విద్యాహక్కు చట్టం అమలు అటకెక్కిందని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంకా యూనిఫాంలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎబివిపి నగర కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కాలేజ్ ప్రెసిడెంట్ గుర్రపు రిశ్వంత్, మండల నాయకులు లావుడియా అఖిల్, అభినయ్ గౌడ్ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ అవగాహనతో పాటు బిఆర్ఎస్ సభ్యత్వంపై దిశానిర్దేశం

**ప్రజాపక్షం / కాగజ్‌నగర్ :** ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ శ్రేణులు పూర్తి అవగాహనతో పనిచేసి, ప్రతి అర్హుడైన ఓటరు ఓటు హక్కు పరిరక్షణకు కృషి చేయాలని ఎంఎల్‌సి నారదాసు లక్ష్మణరావు కోరారు. కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్స్‌లో ఎస్ఐఆర్ అవగాహన, బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిర్పూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ జగన్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, సిర్పూర్ మాజీ శాసనసభ్యులు కోనేరు కోనప్ప హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసి బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని, యువత, మహిళలు అధిక సంఖ్యలో చేరేలా కృషి చేయాలని సూచించారు. ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, తెలంగాణ సాధనలో పార్టీ పోషించిన పాత్రను వివరించి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కోనేరు కోనప్ప మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలాన్ని పెంచేందుకు అందరూ సమిష్టిగా పనిచేయాలని కోరారు.




## రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి



**ప్రజాపక్షం/పిట్లం:** రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని పిట్లం మండల వ్యవసాయశాఖ అధికారి సూచించారు. మండలంలోని 5 రైతువేదిక భవనాల్లో రైతులకు విత్తనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు ప్రభుత్వం నిర్ణయించిన రకాలు బీపీటీ 5204, కెఎన్ఎం 1738, కెఎన్ఎం 7715, డబ్లుజీఎల్ 44, జైశ్రీరాం, కంది, మినుము విత్తనాలు సాగు చేయాలన్నారు. అదేవిధంగా నానో యూరియా, డీఏపీ ఎరువులు వినియోగించాలన్నారు. ఈ విత్తన మేళాలు మండలంలోని పిట్లం, తిమ్మానగర్, అన్నారం, కుర్తి, చిన్నకొడప్‌గల్ రైతువేదికల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మెన్ ఒంటరి శపథంరెడ్డి, ముస్కుల సాయిరెడ్డి, సర్పంచు కుమ్మరి చంద్రశేఖర్, నీలబోయిన ప్రవీణ్, ఏఓ వినోద్, ఏఈఓలు వీణ, ప్రదీప్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గంగాప్రవీణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవి, రైతులు పాల్గొన్నారు.

## రైతుల అక్రమ అరెస్టులు అమానుషం

**ప్రజాపక్షం/పిట్లం:** యూరియా ఇవ్వాలని కోరిన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడడం అమానుషమని పిట్లం మండల బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని తాడ్వాయి మండలకేంద్రంలో రైతులకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న పిట్లం బీఆర్ఎస్ నాయకులను పోలీసులు మంగళవారం తెల్లవారుజామున ముందస్తు అరెస్టు చేసి పిట్లం పోలీస్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, బి.విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

## ఎస్ఐఆర్‌పై బిఎల్ఓ, బిఎల్ఎలకు శిక్షణ

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** జుక్కల్ నియోజకవర్గంలోని పిట్లం, మహ్మద్‌నగర్, నిజాంసాగర్ మండలాలకు చెందిన బూత్ లేవల్ ఆఫీసర్లు, బూత్ లేవల్ సూపర్‌వైజర్లు, బూత్‌లేవల్ ఏజెంట్లకు ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమానికి సంబంధించి నవోదయా విద్యాలయం నిజాంసాగర్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జుక్కల్ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, అదనపు కలెక్టర్ విక్రమ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, నిజాంసాగర్, పిట్లం, మహ్మద్‌నగర్ మండలాలకు చెందిన అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు, తహసీల్దార్లు పాల్గొనగా ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ఉద్దేశ్యాన్ని వివరించాలరు. ఓటర్ల వివరాలు సేకరణలో నిబంధనలు పాటించాలని అధికారులకు సూచించినట్లు స్థానిక తహసీల్దార్ పేర్కొన్నారు.

## కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు కేంద్రప్రభుత్వంపై మండిపడ్డారు. మంగళవారం కామారెడ్డి జిల్లాకేంద్రంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని, తెలంగాణపై సవతితల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. కేంద్రం నిర్లక్ష్యం చేసినా రైతులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని, గతంలో జొన్నలను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే ఈసారి పంటల దిగుబడి పెరిగిందని, కాంగ్రెస్ హయాంలో 40 శాతం పంట సాగు పెరిగిందన్నారు. ఇప్పటికి ఎఫ్‌సీఐ జాప్యం చేస్తున్నా తెలంగాణలో వడ్లను పకడ్బందీగా కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. రైతులను అణగదొక్కేందుకు ఎన్ని నల్ల చట్టాలు చేసినా, రైతులకు యూరియా అందించని కేంద్రంతో కొట్లాడి రైతులకు యూరియా అందేలా చూస్తామన్నారు.

## మైనార్టీ శాఖ మినిస్టర్ అజారుద్దీన్‌ని కలసిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు

**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు అబ్దుల్ రజాక్ ఆధ్వర్యంలో జామ మసీద్ కమిటీ సభ్యులు మరియు ముస్లిం సోదరులు సచివాలయంలో మైనార్టీ శాఖ మాత్యులు మొహమ్మద్ అజారుద్దీన్‌ని కలిసి వేములవాడ పట్టణంలోని ఉప్పుగడ్డ వీధిలో గల జామ మసీద్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పర్మిషన్ ఇప్పించాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జామా మసీద్ అధ్యక్షులు నవాబ్ ఖాన్, ఉపాధ్యక్షులు మోసీన్, కోశాధికారి సయ్యద్ షబ్బీర్ మరియు వేములవాడ పట్టణ ముస్లిం సోదరులు ఆరిఫ్, సోయల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## రాయపూర్ కాలనీలో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం



**ప్రజాపక్షం /లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని రాయపూర్ కాండ్లి గ్రామంలోని ఆవర వార్డులో పారిశుధ్యం పూర్తిగా నిరక్ష్యం వహిస్తున్నారు. గ్రామంలోని వార్డు సభ్యు లు ఆరోపణ వ్యక్తం చేస్తూ గ్రామంలోని సర్పంచుకు పంచాయతీ సెక్రెటరీ తమ వార్డులో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని చెప్పిన వినడం లేదంటూ ఆరవ వార్డు సభ్యులు ఆరోపణ వ్యక్తం చేస్తున్నారు. డ్రైన్ పూర్తిగా అపరిశుభ్రంగా ఉందని రాత్రి వేళల్లో దోమలు, ప్రబలే ప్రమాదం ఉందని రోగాలు రాకుండా విచారించి అధికారులు మరియు సర్పంచ్ డ్రైవ్ శుభ్రపర్చాలని కోరారు.

## గిరిజన కుటుంబాలకు కార్మిక బీమా



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మండల మారుమూల గ్రామాలైన కుసుంపూర్, కోలం గూడా, దేవునిగూడా గ్రామాలకు చెందిన గిరిజనులకు మంగళవారం రోజున ముఖ్యమంత్రి కార్మిక భీమా పాలసీలను నిర్మల్ జిల్లా కేంద్రంలోని తిరుమల నర్సింగ్ నిర్వాహకులు డాక్టర్ రమేష్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. ఈ భీమా నిరుపేద కుటుంబాలకు ఆపద సమయంలో ఎంతో ఆసరాగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరికీ భీమా ఉండం ఎంతో అవసరమని, అనారోగ్య బారిన పడినప్పుడు ఈ భీమా ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుఉంపూర్ సర్పంచ్ ఆత్రం అర్జున్, బీర్నంది సర్పంచ్ నవీన్ యాదవ్, పాత ఎల్లాపూర్ సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## మేలు రకం విత్తనాలతో రైతుకు లాభం

**ప్రజాపక్షం / ఖానాపూర్ :** రాష్ట్ర ప్రభుత్వం సూచించిన వరి వంగడాలనే వాడితే బాగుంటుందని తద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించే బోనస్ వంటి ఉపయోగాలు రైతులకు అందుతాయని ఆత్మ చైర్మెన్ తోట సత్యం తెలిపారు. తను మాట్లాడుతూ, ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు స్తనపల్లి రైతు వేధికలో జరిగిన రైతు విత్తన మేళా కార్యక్రమంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేసి నాణ్యమైన విత్తనాలను మాత్రమే ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు రాజూర త్యం, మండల అధ్యక్షులు జంగిలి శంకర్, శ్రీపాద శేషాద్రి బాలసంకుల రాజేందర్, ఏడిఏ సుజాత, ఏఓ జగదీశ్వర్, ఏఈఓ రజిత, నాయకులు రైతులు పాల్గొన్నారు.



## శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు స్ఫూర్తిదాయకం

### బిజెపి నాయకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** జాతీయ ఏకత్వం కోసం ప్రాణత్యాగం చేసిన మహానేత డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమని బిజెపి నాయకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణ బిజెపి కార్యాలయంలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత కోసం శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని కొనియాడారు. ఒక దేశం ఒక రాజ్యాంగం అనే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లిన మహోన్నత నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు ధోని శ్రీశైలం, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ డాక్టర్ కొత్తపల్లి అనిత, చింతలమానపల్లి మండల అధ్యక్షుడు డోకే రాము, కాగజ్‌నగర్ మండల అధ్యక్షుడు పుల్ల అశోక్, కౌటాల మండల అధ్యక్షుడు కుంచల విజయ్ పాల్గొన్నారు.

## నిర్మల్‌లో ముమ్మరంగా నాలాల పూడిక తొలగింపు పనులు

**ప్రజాపక్షం /నిర్మల్ టౌన్ :** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నిర్మల్ పట్టణంలో మున్సిపల్ శాఖ ముందస్తు చర్యలుచేపట్టింది. వర్షపు నీరు సాఫీగా ప్రవహించేందుకు, ప్రజలకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు పట్టణంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో నాలాల పూడిక తొలగింపు పనులను ముమ్మరం చేశారు. పట్టణంలోని మంజులాపూర్, బేస్తవార్‌పేట్, కాల్వగడ్డ, గాంధీచౌక్, మంచిర్యాల చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఈ పనులు వేగంగా సాగుతున్నాయి. మున్సిపల్ వైస్ చైర్మెన్ శ్రీ అప్పాల గణేష్ చక్రవర్తి ఆదేశాల మేరకుమున్సిపల్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నాలాల్లో పేరుకుపోయిన పూడిక ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నారు.

### ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

ఈ ముందస్తు చర్యల ద్వారా వర్షపు నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులు తొలగిపోనున్నాయి.లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు తగ్గడంతో పాటు, దోమల వ్యాప్తి అరికట్టి ప్రజారోగ్య పరిరక్షణకు ఎంతగానో దోహదపడనుంది. ఈ పూడిక తొలగింపు పనులను మున్సిపల్ కమీషనర్ యం.రవిబాబు, డీఈ హరిభూషన్ స్వయంగా పర్యవేక్షించగా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




## బాసర మహంకాళి ఆలయంలో చోరీ

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్‌పి డా.జి జానకీ షర్మిల

**ప్రజాపక్షం / బాసర :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ పరిధిలోని మహంకాళి ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున చోరీ కలకలం సృష్టించింది. గుర్తుతెలియని దుండగులు ఆలయ గేటు పగలగొట్టి అమ్మవారి వెండి కిరీటంతో పాటు హుండీని ఎత్తుకెళ్ళారు. హుండీలోని నగదును కాజేసిన అనంతరం దానిని వ్యాసగుడి సమీపంలో పడేసి పరారయ్యారు. ఉదయం పూజల కోసం వెళ్ళిన అర్చకులు ఈ విషయాన్ని గమనించడంతో చోరి ఘటన వెలుగులోకి వచ్చింది. నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జీ. జానకీ షర్మిల ఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించారు.

### ప్రతీకోణంలోనూ దర్యాప్తు ఎస్పీ ఆదేశాలు

చోరి జరిగిన తీరు, క్లూస్ టీం సేకరించిన ప్రాథమిక ఆధారాలు మరియు ఆలయ పరిసరాల్లోని సీసీ టీవి ఫుటేజీలను ఎస్పీ అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి, నిందుతులను వీలైనంత త్వరగా గుర్తించి అరెస్ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

### భద్రతపై ప్రత్యేక దృష్టి

ఆలయ భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘాను మరింత పెంచాలని, ఆదునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దర్యాప్తులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కేసు చేదనకు ఇప్పటికే పత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు త్వరలోనే నిందితులను పట్టుకుంటామని స్పష్టం చేశారు.భక్తులు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఆలయ పరిసరాల్లో ఏలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించ వెంటనే పోలీసలకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.



### హాజరైన అధికారులు

ఎస్పీ పర్యటనలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఇన్స్‌పెక్టర్లు రవీందర్ నాయక్, సమ్మయ్య స్థానిక ఎస్.ఐ.లు, ఇతర పోలీస్ సిబ్బందితో పాటు దేవస్థానపాల్గొన్నారు.

## నిర్మల్‌లో ఎబివిపి పాఠశాలల బంద్ విజయవంతం

**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ :** రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రైవేటు విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏబీవీపి జిల్లా కన్వీనర్ మాడిపెల్లి దినేష్ మాట్లాడుతూ, రేషనలైజేన్ పేరుతో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కుట్రను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్పోరేట్ స్కూళ్ళలో విచ్చలవిడి ఫీజుల నియం త్రణకు చట్టం తీసుకురావాలని పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు ఇచ్చేలా విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమచే చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఖాలీగా ఉన్న టీచర్ , డీఈఓ, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన విద్యార్థులకు ఇంతవరకు యూనిఫాం లు అందించకపోవడంపై మండిపడ్డారు. గురుకులాల్లో నాణ్యమైన భోజనం, అందించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను తక్షణమే అమలు చేయాలని కోరారు.

## జిల్లా కిసాన్ మోర్చా.. అధ్యక్షుడిగా ఒడ్డెటి నాన్నయ్య



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా ఒడ్డెటి నాన్నయ్య నియమితులయ్యారు.పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రైతుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పంటలకు గిట్టుబాటు ధర, బీమా వంటి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పాటుపడతానని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి రైతులతో మమేకమై వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కిసాన్ మోర్చా తరఫున పోరాడతానని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడైన రైతుకు చేరేలా కృషి చేస్తానని, జిల్లాలో కిసాన్ మోర్చా బలోపేతానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడతానని వివరించారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ రైతు సంక్షేమం కోసం అంకితభావంతో పని చేస్తానని స్పష్టం చేశారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం /దిలావర్‌పూర్ :** డ్రగ్స్‌ను అరిఆకట్టడానికి నిరంతరం కఠిన చర్యలు చేపడుతున్నామని దిలావర్‌పూర్ పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్ రవీందర్ అన్నారు. దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం రోజున డ్రగ్స్ నిరోదంపై మరియు సైబర్ క్రైం పై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడటం వల్ల అనేక మంది జీవితాలను నాశనం చేసుకొని వారి తల్లిదండ్రులను తీరని క్షోభకు గురి చేస్తున్నారని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన వారు జీవితంగా బాగుపడిన దాఖరాలు లేవని చెప్పారు. ఏలాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా నిత్యం చదువుపై దృష్టి సారించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగాలని సూచించారు. సైబర్ నేరాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు ఉన్నాయని చెప్పారు. తగు జాగ్రత్తలు తీసుకొని సైబర్ మోసాలకు గురికాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు, ఏ. నాగభూషణం, ఉపాధ్యాయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య శ్రీ పథకంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

### జిల్లా వైద్యశాఖాధికారి, డాక్టర్ రాజేందర్

**ప్రజాపక్షం / నిర్మల్ :** ఆరోగ్య శ్రీ పథకం అమలులో ఏ ప్రైవేటు ఆసుపత్రి అయినా అక్రమాలకు పాల్పడితే కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ధికారి డాక్టర్ రాజేందర్ స్పష్టం చేశారు. రోగులను ఆరోగ్య శ్రీ కింద చేర్చుకున్నాక, టెస్టుల పేరుతో అదనపు బిల్లులు వేసి డబ్బులు వసూలు చేయడం నిబంధనలకు విరద్ధమని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వం నుండి ఆరోగ్య శ్రీ క్లయిం డబ్బులు మంజైరైన తర్వాత ఆసుపత్రులు, రోగుల నుండి అంతకుముందు తీసుకున్న మొత్తాన్ని తిరిగి ఇవ్వకపోతే అది తీవ్రమైన తప్పు అవుతుందని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడ ఏ. ప్రైవేటు ఆసుపత్రిలోనైనా ఆరోగ్య శ్రీ నిబంధనల ఉల్లంఘున జరిగినట్లు ఆధారలతో ఫిర్యాదు వస్తే తక్షణమే కఠిన విచారణ జరిపిస్తామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో తప్పు రుజువైతే సదరు ఆసుపత్రులపై శాఖాపరంగా కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని డి.ఎం.హెచ్.ఓ. భరోసా ఇచ్చారు.

## ఫ్యాన్ల అందజేత



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండలంలోని మెండోరా పాఠశాలకు గత సంవత్సరం పదవ తరగతి పరీక్షలో ప్రథమ స్థానం పొంది బాసర (ట్రిబుల్ ఐటి)లో సీటు సాధించిన ఎండి.సోనా తండ్రి మహ్మద్ షకీల్ పాఠశాలకు 10 వేల విలువ గల ఆరు ఫ్యాన్లను బహుకరించారు. వారి గొప్ప మనసుకు కృతజ్ఞతా పూర్వకంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం శాలువతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పి. గంగామోహన్, రాజశేఖర్, ప్రశా ంత్, సింహం, కిషన్, సాగర్, గీత, హేమ, రాధిక, అఖిల, దిలీప్, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** వర్షాకాలం దృష్ట్యా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని కమీషనర్ గజానంద్ తెలిపారు. పట్టణంలోని 8వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చైర్‌పర్సన్ బోదిరె నాగమణి స్వామి పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా పట్టణంలోని అన్ని వార్డులలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించటంజరుగుతుందన్నారు. మురికి కాలువల శుభ్రం చేయడం, మురికి కాలువల వెంబడి ఉన్న పిచ్చిమొక్కలను తొలగించడం, దోమలు పెరగకుండా దోమల లార్వా స్ప్రే చేయటం వంటి కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్ సంటిలత, నర్సయ్య, కౌన్సిలర్ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

## 108ను తనిఖీ చేసిన అధికారులు



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ వాహనాన్ని మంగళవారం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్, ఈఎంసీ స్వరాజ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అత్యవసర సమయంలో వినియోగించే పరికరాల పనితీరును, సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందికి వారు పలు సూచనలు, సలహాలు చేశారు. రోడ్డు యాక్సిడెంట్లు, గర్భిణులు, పాము కాటు వంటి ఎటువంటి అత్యవసర పరిస్థితుల్లోనూ 108 అంబులెన్స్‌ను మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వీరి వెంట ఈఎంటీ కొత్తపల్లి సాగర్, పైలట్ రమేష్ ఉన్నారు.

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందించాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం / కలెక్టరేట్:** జిల్లాలో అన్ని శాఖలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ సకాలంలో జీతాలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, వివిధ శాఖల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు, తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాఖల వారిగా జిల్లాలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, శాఖలు, ఏజెన్సీలు సమర్పించిన ఉద్యోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు అందగానే ఏజెన్సీలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాల్లోకి జీతాలు జమ చేయాలన్నారు. వేతనాలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పి.ఎఫ్. డబ్బులను సకాలంలో జమ చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి లభించిన పోస్టులను నియమ నిబంధనల ప్రకారం పారదర్శకంగా భర్తీ చేయాలని చెప్పారు. ఉద్యోగుల వివరాల వెల్లడింపులో ఆలస్యం చేయకూడదన్నారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ. రాథోడ్ రమేష్, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి విజయలక్ష్మి వివిద శాఖల అధికారులు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల నిర్వాహకులు ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

### సిఐటీయు డిమాండ్



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్మల్ పట్టణంలోని నాయుడువాడ వార్డులో గల అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.లలిత, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శైలజ మాట్లాడుతూ, రాష్ట్రంలో 70 వేల మంది అంగన్‌వాడీలు దశాబ్దాలుగా సేవలందిస్తున్నా వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ మెనిపెస్టో ప్రకారం రూ. 18000 వేతనం , పిఎఫ్ సౌకర్యం కల్పించాల,ఇ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఐసీడిఎస్ వ్యవస్థను బలహీనపరిచే ఎన్ఈపి 2020 పీఎం శ్రీ విధానాలను రద్దు చేసి అంగన్‌వాడీల ద్వారానే ప్రీ ప్రైమరీ విద్యను కొనసాగించాలన్నారు. 24 రోజుల సమ్మె వేతనాలు పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని , ఖాళీగా ఉన్న 15 వేల పోస్టులను భర్తీ చేచేయాలని కోరారు. ఎస్.ఆర్.ఎస్. యాప్ ను రద్దు చేసి, ఆన్‌లైన్ పనుల కోసం 5జీ మొబైళ్ళు ఇవ్వాలని, బీ.ఎల్.ఓ. వంటి అదనపు పనుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటీయూ పట్టణ అధ్యక్షురాలు సాధ, నాయకులు శ్యామల, గంగామణి, అమృత తదితరులు పాల్గొన్నారు.

## వరద కాలువ గండి పనులను పరిశీలించిన అధికారులు



**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని గాండ్లపేట వద్ద గల ఇందిరమ్మ వరద కాలువ గండి వలన తెగిన గాండ్లపేట్ పెద్దవాగు కుడివైపు కట్ట పునర్నిర్మాణ పనులను నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు. ఈ పనులను నీటిపారుదల శాఖ నాణ్యత విభాగం నిజామాబాద్ కార్యనిర్వహక ఇంజనీర్ భాను ప్రకాష్, డీఈఈ అపర్ణ, ఏఈఈ దత్తాత్రి, వరద కాలువ డిఈఈ గణేష్, ఏఈఈ లు విన్యస్ రెడ్డి, కొండ వంశీ, పవన్‌లు పరిశీలించారు.

## హెల్ప్ డెస్క్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/బోధన్:** హెల్ప్ డెస్క్‌ను ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఆర్డీవో విజయ కుమారి సూచించారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో సర్2026లో భాగంగా బోధన్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎలక్షన్ సెల్ వద్ద ఎన్నికల సంఘం ఆదేశానుసారం బోధన్ ఆర్డీవో విజయ కుమారి హెల్ప్ డెస్క్ ను ఆవిష్కరించారు. ఆర్డీవో మాట్లాడుతూ.. హెల్ప్ డెస్క్‌ను అందరూ ఉపయోగించుకోవాలన్నారు.

## జాన్కంపేట్ పిఎం పాఠశాలను సందర్శించిన ప్రభుత్వ సలహాదారు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో గల పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలను ప్రభుత్వ సలహాదారు, స్థానిక ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి సందర్శించారు. పాఠశాల పరిసరాలను, విద్యా ప్రమాణాలను పరిశీలించిన ఆయన, స్కూల్ నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఇవే కాకుండా పాఠశాలకు ఇంకా ఏవైనా అదనపు అవసరాలు, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుక రావాలని, వాటన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, సర్పంచ్ అనురాధ కిషన్ గౌడ్, స్థానిక నాయకులు, పాఠశాల హెచ్‌ఎం జోన్స్, ఉపాధ్యాయ బృందం, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### డా, శ్యామా ప్రసాద్ ముఖర్జీ నివాళ్లు

**ప్రజాపక్షం /ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో డా, శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహం వద్ద అయన చిత్రపటానికి పూల మాలతో నివాళులు అర్పించరు. ఆర్టికల్ 370 రద్దు చేయాలని ఒక దేశం లో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదు అని కశ్మీర్ భారత్ లోని అంతర్ భూ భాగమేనని పోరాడారు అన్నారు. ఆయన సేవలను కొనియాడారు.

## అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ భోధ్ శాఖ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ విజయవంతం




**ప్రజాపక్షం /భోథ్ :** ఈ సందర్భంగా బోయిడి ఆకాష్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల పేరుతో 27000 ప్రభుత్వ పాఠశాలలో 23000 ప్రభుత్వ పాఠశాలల ఎరితవేతకు కుట్రను ఆపాలని, ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడీని అరికట్టి ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, గురుకుల పాఠశాలలకు పాక్కా భవనాలు, నిర్మించాలని అన్నారు. ఎన్.ఈ.పి. 2020 ని వేంటనే అమలు చేయాలని ప్రైవేటు స్కూల్ మేనేజ్‌మెంట్ల ఆధ్వర్యంలో నడుస్తున్న బుక్స్ యూనిఫామ్స్ విక్రయాలను నిషేదించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వాప్త పాఠశాలల బంద్ విజయవంతం అయిందని తెలిపారు. నగర కమిటీ సభ్యులు అభి అఖిల్ కార్తిక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు అండగా



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మండలంలోని ముచ్కూర్ గ్రామాభివృద్ధే లక్ష్యమంటూ ప్రజా సేవకే కృషి చేస్తున్న సర్పంచ్ కొడిగెల శ్రీనివాస్ మంగళవారం గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికులకు తన ఐదు నెలల జీతాన్ని అందజేసి మాట్లాడారు. సమాజంలో పరిశుభ్రతను కాపాడి, ప్రజారోగ్యానికి మూలస్తంబంగా నిలిచే వారు పారిశుధ్య కార్మికులన్నారు. గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలందిస్తున్న అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపసర్పంచ్ ఉన్నారు.

## విద్యార్థులకు బ్యాగ్ నోట్ బుక్స్‌లు పంపిణీ



**ప్రజాపక్షం/బోధన్:** ఫౌండేషన్ విద్యయ ఆధ్వర్యంలో మంగళవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణం శక్కర్ నగర్ లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు బుసా సునీత మాలినథ్ లా కుమార్తె డల్లాస్ టెక్సెల్స్ అమెరికా పౌండేషన్ విద్యయ ప్రతినిధి బుసా విరిక పాఠశాలలోని విద్యార్థినీలకు నోటు బుక్కులు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మహిళా విద్యార్థులు ఉన్నత చదువులు చదివి అన్ని రంగాలలో రాణించాలనే ఉద్దేశ్యంతో తనవంతుగా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని అన్నారు. ఇకముందు కూడ పాఠశాలలోని విద్యార్థులకు వారి కుటుంబ సభ్యుల తోడు ఉంటుందన్నారు. అనంతరం సంస్థ ప్రతినిధికి పాఠశాల తరపున శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల అధ్యక్షులు గణేష్, మహేష్, నరేష్, ఉపాధ్యాయినీలు స్వప్న, కవిత రజిత గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# సంఘ స్వామికి పితృవియోగం



**ప్రజా పక్షం/ వేములవాడ :** వేములవాడ మున్సిపల్ పరిధిలోని శత్రాజ్ పల్లి కి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంగ స్వామి తండ్రి, 1 వార్డు కౌన్సిలర్ సంగ హనుమవ్వ భర్త సంగ లచ్చయ్య మంగళవారం అనారోగ్యంతో మరణించారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ భౌతికకాయానికి నివాళులు అర్పించి మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని వ్యక్తం చేశారు. మధ్యాహ్నం జరిగిన అంతిమ యాత్రలో పాల్గొని అశ్వనయనాలతో వీడ్కోలు పలికారు. అంతిమయాత్రలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజులతోపాటు మున్సిపల్ పాలకమండలి సభ్యులు, మార్కెట్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో బలిదాన్ దివాస్

**ప్రజా పక్షం/ వేములవాడ :** శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ వేడుకలు బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ 1951 లో భారత దేశంలో మొదటి హిందూ రాజకీయ పార్టీగా భారతీయ జన సంగ్ స్థాపించి భారతదేశ ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చిన గొప్ప మహానుభావుడు వారి రాజకీయ జీవితం జైల్లోనే తుది శ్వాస విడవడం ఆరోజును బలిదాన్ దివాస్గా భారతీయ జనతా పార్టీ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ ఒకే దేశం ఒకే పార్టీ అనే నినాదంతో 1901 జన్మించిన వారు 53 ఏళ్లు సుదీర్ఘమైన జీవితంలో భారతీయ జనతా పార్టీకి ఎన్నో విధాల సేవలు అందించారని వారి ఆశయాలకు అనుకూలంగా ఇప్పటికీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బిజెపి అవతరించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్, రాష్ట్ర నాయకులు రేగుల రాజు, కోల కృష్ణస్వామి, జిల్లా నాయకులు రేగుల మల్లికార్జున్, కౌన్సిలర్స్ వంగల శ్రీను, కండ్లేపు ముత్యం, మైలారం శ్రీనివాస్, నాయకులు పిన్నింటి హనుమాన్లు, బోనాల శివ, మామిళ్ల లక్ష్మీరాజ్యం, బిల్లా కృష్ణ, కటకం శ్రీనివాస్, జవ్వాజి శేఖర్, అన్నం నరసయ్య, కుమ్మరి నరేష్, చిక్కుడు మల్లేశం, రఘుపతి సగ్గు రాహుల్, పోతారం సాయి, రంజిత్ రెడ్డి, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొనీ వారికి శ్రద్ధాంజలి ఘటించారు.



# నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్సులు రద్దు, క్రిమినల్ కేసులు

### ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి హెచ్చరిక



**ప్రజాపక్షం/ఎడపల్లి:** రైతాంగ ప్రయోజనాలను కాపాడటమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమాన్ని ఆయన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు అందుబాటులో ఉంచిన వివిధ పంటల వంగడాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల నాణ్యతను వారు నిశితంగా పరిశీలించారు. రాష్ట్రంలో ఎక్కడా నకిలీ, నాసిరకం విత్తనాల పంపిణీ జరగకుండా రైతులు మోసపోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. నకిలీ విత్తనాలను విక్రయించే డీలర్లపై కఠినంగా వ్యవహరిస్తామని, వారి లైసెన్సులను రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని ఆయన హెచ్చరించారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి మంగళవారం రైతు వేదికలలో నిర్వహించే రైతు మేళాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ అధికారులు, ఎఈఓ లు నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతులకు తగిన సలహాలు అందించాలని సలహాలు అందించాలని స్పష్టం చేశరు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో సరిపడా యూరియా, ఇతర ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. మన రాష్ట్రంలో విజయవంతంగా నడుస్తున్న ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా పంపిణీ పారదర్శకంగా సాగుతోందని, దీనిని దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని కలెక్టర్ తెలిపారు. మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందని, అందువల్ల రైతులు నానో యూరియా వినియోగంపై దృష్టి సారించాలని ఆమె హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి నవీన్, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు

### కలెక్టర్‌తో కలిసి నవీపేట్‌లో స్థల పరిశీలన



**ప్రజాపక్షం/ఎడపల్లి:** రాష్ట్రంలోని విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను వెచ్చిస్తుందని ఆయన తెలిపారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు అందుబాటులో ఉన్న స్థలం, ఇతర వసతులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని రకాల ఆధునాతన సౌకర్యాలతో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఒకటవ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్యా బోధన సాగేలా ఈ స్కూళ్లను తీర్చిదిద్దుతున్నామన్నారు. బోధన్ నియోజకవర్గంలో ఇప్పటికే రూ. 200కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేశామని గుర్తు చేశారు. అధునాతన వసతులతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన నిర్మాణానికి సంబంధించి తక్షణమే సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. అదనపు తరగతి గదులు, ఆధునాతన ల్యాబ్స్, లైబ్రరీ, కంప్యూటర్ రూములు, ఆర్ఓ వాటర్ ప్లాంట్, బోర్‌వెల్ తదితర మౌళిక వసతులు ఉండేలా ప్లాన్ చేయాలన్నారు. స్థల పరిశీలన అనంతరం కలెక్టర్ పాఠశాల తరగతి గదులను సందర్శించి, విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పలు ప్రశ్నలు వేసి వారి విద్య సామర్థ్యాలను పరీక్షించారు. చురుగ్గా, సరైనా సమాధానాలు చెప్పిన విద్యార్థులను అభినందిస్తూ చాక్లెట్లు, బహుమతులు అందచేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనలు పూర్తిగా అమలు కాకపోవడం వల్ల అనేక ఇబ్బందులు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో గత సంవత్సరం జరిగిన ఉపాధ్యాయుల సర్దుబాటులో ప్రభుత్వ నిబంధనలు పూర్తిగా అమలు కాకపోవడం వల్ల అనేక మంది ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని టీఆర్టీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ అన్నారు. మంగళవారం ఉపాధ్యాయుల సర్దుబాటులో నిబంధనలు పాటించడంతోపాటు జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సూపరింటెండెంట్ భూపతి రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యా సంవత్సరంలో సర్దుబాట్లు చేపట్టే సమయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. నార్మ్స్ ప్రకారం మొదట స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో, తరువాత మండల స్థాయిలో, ఆపై ప్రక్క మండలాలలో, చివరిగా మాత్రమే జిల్లా స్థాయిలో సర్దుబాట్లు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గత సంవత్సరం ఇతర మండలాలలో సర్దుబాటు చేయబడిన ఉపాధ్యాయులను వారి స్వంత మండలాలకు లేదా సమీప ప్రాంతాలకు సర్దుబాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. సంపాదిత సెలవులు ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల పెండెన్సీని తొలగించాలన్నారు. సరెండర్ లీవ్ బిల్లులను వెంటనే ఆమోదించి చెల్లింపులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పోతుగంటి రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ గోలి రాధాకిషన్, ఎల్లారెడ్డిపేట మండలం ప్రధాన కార్యదర్శి పులి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

### వీర్నపల్లి కెజిబివిలో ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం వంట గదిలో ఉన్న బియ్యం, ఆహార పదర్థాల నాణ్యతను పరిశీలించారు. మెను చార్ట్ ప్రకారం ఏ ఏ ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నారో తెలుసుకుని, ఆహార పదార్థాల నిల్వకు సంబంధించి పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు కచ్చితంగా నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులు అందరూ తరగతులకు హాజరయ్యేలా చూడాలని, ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. పరిశీలనలో మండల ప్రత్యేక అధికారి క్రాంతి, తహసీల్దార్ నారాయణ రెడ్డి, సర్పంచ్ జ్యోత్స్న తదితరులు ఉన్నారు.

# రైతు వేదికలో విత్తన మేళా సబ్సిడీపై కందుల మినీకిట్ల పంపిణీ




**ప్రజాపక్షం /ముస్తాబాద్ :** ముస్తాబాద్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు నాణ్యమైన విత్తనాల వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు మరియు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా 30 మంది రైతులకు 100 శాతం సబ్సిడీపై కందులు (రెడ్‌గ్రామ్) మినీకిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనూష, ఏ ఈ ఓ లు,ఆత్మ కమిటీ డైరెక్టర్లు కొండల్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్ల బాల్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు. రైతులు ప్రభుత్వ వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విత్తనాలతో సాగు చేపట్టి అధిక దిగుబడులు, అధిక ఆదాయం సాధించాలని అధికారులు కోరారు.

# మినీ జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు వినియోగించుకోవాలి

### జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారిని నిర్మల

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజి రాజన్న సిరిసిల్ల అద్వర్యంలో సిరిసిల్ల ఎంప్లాయిమెంట్ ఆఫీసు నందు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధి కల్పన శాఖ ధికారిణి నిర్మల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఇది వినియోగించుకోవాలని కోరారు. ఇంటర్/ డిగ్రీ పూర్తి చేసిన రూపాయలు 10,000 ల నుండి 15,000 ల రూపాయల వరకు వేతనం అభ్యర్థులకు నెలకు ఉంటుందని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా లోని అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాఫీలతో రాజన్న సిరిసిల్ల జిల్లా లోని ఎంప్లాయిమెంట్ ఆఫీసు, సిరిసిల్లలో ఈనెల 25వ తారీకు ఉదయం 11:00 గంటలకు జరుగు మినీ జాబ్ మేళాకు హాజరుకావాల్సిందిగా కోరారు. ఏమైనా సందేహాలు ఉంటే 8333059105, 8500818717, 7382794374 డిఈఈ సంప్రదించాలని తెలిపారు.